క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో ఉన్న భీమేశ్వర ఆడిటోరియంలో నల్లా సూర్యచంద్రరావు ట్రస్ట్ సౌజన్యంతో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ సభ్యులు మంగళవారం తెలిపారు. కళ్లు, బీపీ, సుగర్, గుండె సంబంధిత వ్యాధులు, 2డీ ఈకో, ఈసీజీ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

మొక్కలు నాటిన మహిళా పోలీసులు



మహిళా పోలీసులకు మొక్కలను ఇస్తున్న మిషన్‌శక్తి సభ్యులు

యానాం: స్త్రీ, శిశు అభివృద్ధి శాఖ మిషన్‌శక్తి ఆధ్వర్యంలో బేటీబచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులు, హోంగార్డులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మిషన్‌శక్తి కోఆర్డినేటర్ ఎ రిప్కారోజ్‌లిన్ మాట్లాడుతూ బాలికల విద్యకు అందరూ ప్రాధాన్యమివ్వాలని బాలురతో సమానంగా వారిని తల్లిదండ్రులు చదివిస్తూ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. సీఐ అడలరసన్, ఎస్సై పునీత్‌రాజ్, ట్రాఫిక్ ఎస్సై నూకరాజు, హెడ్‌కానిస్టేబుల్ లత పాల్గొన్నారు.

బోడసకుర్రులో బేటీ బచావో.. బేటీ పఢావో

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని పల్లిపాలెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కిషోర వికాసం-2 కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ కౌమార దశ బాలికల సాధికారిత కోసం గ్రామాల్లో వేసవి శిబిరాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బాలల హక్కులు, చట్టాలు, కౌమార దశలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత, బాల్య వివాహాలు అరికట్టడం, పిల్లల డ్రాపౌట్, బాల కార్మికులు తదితర విషయాలపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బస్వాని విజయకుమారి, బస్వాని హేమలత, కారాడి నాగలక్ష్మి, అమరావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూలో 63 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖలో ఖాళీగా ఉన్న 63 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మంగళవారం రెవెన్యూశాఖ స్పెషల్ సెక్రటరీ కులుంగొత్తన్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రూప్-సి నాన్ గెజిటెడ్ విలేజ్ అసిస్టెంట్ పోస్టులు-54, మల్టీటాస్కింగ్ స్టాఫ్ (లీగల్ మెట్రాలజీ)-9 పోస్టులను రాతపరీక్ష ద్వారా భర్తీ చేస్తామన్నారు. కేటగిరీల వారీగా ఖాళీలు, రిజర్వేషన్, అర్హతలు, పరీక్ష విధానం, దరఖాస్తులు తదితర వివరాలు 'రిక్రూట్‌మెంట్.పివై.జిఓవి.ఇన్' పోర్టల్ లో ఈ నెల 15నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు తమ దరఖాస్తులను జూన్ 14లోగా సమర్పించాలని కోరారు. ఈ పోస్టులకు యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్‌ల అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు.

యూడీసీలకు పదోన్నతి

యానాం: ప్రభుత్వ శాఖల్లో యూడీసీలుగా పనిచేస్తున్న వారికి ఇటీవలి డిపార్ట్‌మెంట్ పరీక్షను నిర్వహించి వారికి అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పిస్తూ మంగళవారం ప్రభుత్వ కార్యదర్శి వి.జయశంకర్ ఆదేశాలు జారీచేశారు.

ఎన్నికల సంఘం అభిప్రాయ సేకరణ

యానాం: వచ్చే ఏడాది పుదుచ్చేరి అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం భారత ఎన్నికల సంఘం వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిందని పుదుచ్చేరి డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ అధికారి తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్‌సింగ్‌సంధు, డాక్టర్ వివేక్‌జోషి ఎన్నికల నిర్వహణకు సంబంధించి అభిప్రాయ సేకరణ చేశారని తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



దాతలు అందించిన పుస్తకాలతో విద్యార్థులు

ఉప్పలగుప్తం: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులకు ఉపయోగపడేలా బండారు సాయి షణ్ముక్ సౌజన్యంతో అతని స్నేహితుడు నాగులపల్లి పాపయ్యరాజు చేతుల మీదుగా రూ.10వేల విలువగల పుస్తకాలను మంగళవారం గ్రంథాలయాధికారి ఎస్.నాగేశ్వరరావుకు అందించారు.

ఇంటింటికీ గ్యాస్ హుళక్కేనా?

- స్థానికులకు ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు తరలించడంపై అసంతృప్తి
- పోలేకుర్రు టు యానాం గ్యాస్ పైపులైన్ ఏర్పాటు
- సుంకటరేవులో శరవేగంగా గ్యాస్ ట్యాపింగ్ యూనిట్ నిర్మాణ పనులు
- జనావాసాల మధ్య నిర్మాణంపై భయాందోళనలో ప్రజలు



గ్యాస్ ట్యాపింగ్ యూనిట్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేసిన గ్రామస్తులు



పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవు వద్ద గ్యాస్ ట్యాపింగ్ యూనిట్ నిర్మాణ పనులు



పీఐఎల్ ప్రతినిధులు, గ్రామస్తులతో చర్చిస్తున్న తహసీల్దార్ త్రినాథరావు తదితరులు (ఫైల్)

తాళ్లరేవు: మండలంలో రెండు అతిపెద్ద చమురు సంస్థలు ఉన్నప్పటికీ స్థానిక ప్రజలకు మాత్రం ఇంటింటికీ గ్యాస్ అందే అవకాశాలు కనిపించడం లేదు. దేశంలోనే పేరెన్నికగన్న చమురు సంస్థలు తాళ్లరేవు మండలంలో ఉన్నప్పటికీ మండల ప్రజలకు మాత్రం ప్రయోజనం చేకూరడంలేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చమురు సంస్థలు ఉన్న స్థానిక గ్రామాల ప్రజలకు కాకుండా ఇతర ప్రాంతాలకు గ్యాస్‌ను సరఫరా చేయడం, ఆయా సంస్థల సీఎస్‌ఆర్ నిధులతో ఇతర ప్రాంతాలను అభివృద్ధి చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని గాడిమొగలో రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ ఉండగా, పి.మల్లవరం గ్రామ పంచాయతీలో ఓఎన్‌జీసీ సంస్థ ఉంది. అయితే సంస్థలు ఉన్న ముమ్మిడివరం నియోజకవర్గానికిగాని, మండలానికిగాని, కనీసం ఆయా సంస్థలు ఉన్న గ్రామాలకు గాని గ్యాస్ సరఫరా చేయడంలేదు. అటు కాకినాడకు ఇటు యానాంకు మాత్రం పైపులైన్‌లు వేసి ఇంటింటికీ గ్యాస్‌ను సరఫరా చేస్తున్నారు. మండలంలో ఉన్న చమురు సంస్థలతో తాళ్లరేవు మండల రూపురేఖలు మారిపోతాయని అందరూ భావించారు. అయితే ఆయా చమురు సంస్థలు సవతి తల్లి ప్రేమను చూపిస్తూ ఉన్న మండలానికి నిధులు కేటాయించకుండా ఇతర ప్రాంతాలను అభివృద్ధి చేస్తుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికుల్లో ఆందోళన

మండల సరిహద్దులో ఉన్న యానాంకు ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేందుకు పైపులైన్ వేశారు. దానికి సంబంధించి మండల పరిధిలోని పలు గ్రామాల మధ్యలోనుంచి పైపులైన్ వేసి జనావాసాల మధ్యలో సుంకటరేవులో గ్యాస్ ట్యాపింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇది స్థానిక ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. పైపులైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(పీఐఎల్) సంస్థ సుంకటరేవులో చేపట్టిన గ్యాస్ ట్యాపింగ్ యూనిట్ పనులను గతంలో వ్యతిరేకిస్తూ స్థానికులు తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేశారు. ఈ నేపథ్యంలో సుమారు ఐదు నెలల పాటు పనులు నిలిచిపోయాయి. అయితే ఇటీవల గ్యాస్ ట్యాపింగ్ యూనిట్ పనులను తిరిగి వేగంగా నిర్వహిస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పంచాయతీ అభివృద్ధికి పైపులైన్ నిర్మాణ సంస్థ నిధులు కేటాయించేందుకు అంగీకరించిన కారణంగానే తిరిగి పనులు ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి స్థానికులకు ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఒప్పందాలను అమలు చేయాలి



చమురు సంస్థల నిర్మాణ సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ముఖ్యంగా చమురు సంస్థల ద్వారా స్థానిక గ్రామాలకు ఇంటింటికీ గ్యాస్ ఇచ్చిన తరువాతే ఇతర ప్రాంతాలకు సరఫరా చేయాలి. సంస్థల కారణంగా నష్టపోతున్న స్థానికులకు ఇవ్వకుండా వేరే ప్రాంతానికి ఎలా తరలిస్తారు. ప్రధానంగా చమురు సంస్థల కారణంగా గాడిమొగ, పి.మల్లవరం, పోలేకుర్రు, జార్జీపేట, నీలపల్లి, తాళ్లరేవు తదితర ప్రాంతాల్లో కాలుష్యం అధికంగా ఉంటుంది. అయినప్పటికీ ఈ ప్రాంతాల అభివృద్ధికి తూతూ మంత్రంగా నిధులు కేటాయిస్తూ ఇతర ప్రాంతాలకు మాత్రం నిధులు వెచ్చిస్తున్నారు. సీఎస్ఆర్ నిధులను మండలానికి కేటాయించడంతోపాటు, స్థానికులకు ఉద్యోగవకాశాలు కల్పించాలి.

కుడుపూడి శివన్నారాయణ, మాజీ సర్పంచ్, పి.మల్లవరం గ్రామ పంచాయతీ

స్థానికులకు సరఫరా చేయాలి



మండలంలో ఉన్న చమురు సంస్థల కారణంగా స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తొలుత స్థానిక గ్రామాల ప్రజలకు ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయడంతోపాటు ఆయా గ్రామాల్లోని రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సౌకర్యాలను కల్పించాలి. గ్యాస్ పైపులైన్, ట్యాపింగ్ యూనిట్‌ల కారణంగా ఏదైనా ప్రమాదం సంభవిస్తే భారీ ఆస్తి, ప్రాణ నష్టం చవిచూడాల్సి వస్తుంది. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు. మండలంలో ఉన్న ప్రభుత్వాస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలి.

– దడాల బుజ్జిబాబు, మాజీ సర్పంచ్, పోలేకుర్రు గ్రామ పంచాయతీ

డీఆర్వో రాజకుమారి సేవలు ప్రశంసనీయం

అమలాపురం రూరల్: జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి సేవలు ప్రశంసనీయమని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా, సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీ పేర్కొన్నారు. అమలాపురం మండలంలోని ఒక స్కూల్‌లో మంగళవారం డీఆర్వో రాజకుమారికి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకుమారి రెవెన్యూ శాఖలో ఉన్నతాధికారిగా విధులు నిర్వరిస్తూ విద్యాశాఖకు అందించిన సేవలను ప్రశంసించారు. డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతురావు, ఉప విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణ మూర్తి, సమగ్ర శిక్షా ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, డీఎస్‌వో జీవీఎస్ సుబ్రహ్మణ్యం డీఆర్వో రాజకుమారి సేవలను ప్రశంసించారు. జూలై నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా విద్యాశాఖ తరఫున డాక్టర్ షేక్ సలీం బాషా ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు డీఆర్వో రాజకుమారిని సత్కరించారు.

22న హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్ర కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఆర్య వైశ్య మహిళలు

అమలాపురం టౌన్: హనుమాన్ జన్మదినం సందర్భంగా అమలాపురంలో ఈ నెల 22న విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సంయుక్తంగా చేపడుతున్న విజయోత్సవ శోభాయాత్రలో పాల్గొంటున్నట్లు జిల్లా ఆర్య వైశ్య సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీతా మహాలక్ష్మి తెలిపారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆర్య వైశ్య మహిళలు మంగళవారం సమావేశమయ్యారు. బజరంగ్‌దళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు తదితరులు వాసవీ కల్యాణ మండపానికి చేరుకుని ఆర్య వైశ్య మహిళలకు శోభాయాత్ర కర పత్రాలను అందించి వారిని ఆహ్వానించారు. శోభాయాత్రతో పాటు బైక్ ర్యాలీ కూడా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల రోడ్డులో గల త్రిముఖ గణపతి ఆలయం వద్ద నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. విశ్వ హిందూ పరిషత్ మహిళా ప్రముఖ్ గోకవరపు సుభద్ర, దుర్గావాహిని ప్రముఖ్ యెండూరి సీతా మహాలక్ష్మి, అప్పన పద్మజ, కంచర్ల జ్యోతి పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 99.29 శాతం ఉత్తీర్ణత



ఆర్ఏఓ మునిస్వామిని సత్కరించిన విద్యాశాఖాధికారి లక్ష్మణ్ ప్రవీణ్

యానాం: సీబీఎస్ఈ ఫలితాల్లో యానాం నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ హైస్కూల్స్, ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 99.29 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది నుంచి స్టేట్ సిలబస్ స్థానంలో సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తున్న నేపథ్యంలో మంగళవారం వచ్చిన ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత నమోదయ్యిందని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ ప్రకటనలో తెలిపారు. 8 హైస్కూల్స్ నుంచి 283 మంది పరీక్షకు హాజరుకాగా 281 మంది ఉత్తీర్ణత సాధించారని ఆ విధంగా 99.29 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 12వ తరగతి పరీక్షకు హాజరైన 42 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వైస్ ప్రిన్సిపాల్ జి రత్నప్రభ తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ మునిస్వామిని విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ సత్కరించారు.

వీర జవాన్ మురళీ నాయక్‌కు నివాళి



మురళీ నాయక్‌కు కొవ్వొత్తుల ర్యాలీతో నివాళులర్పిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని వీర మరణం పొందిన మురళీ నాయక్‌కు వాకర్స్ క్లబ్ కొవ్వొత్తుల ర్యాలీతో మంగళవారం రాత్రి నివాళి అర్పించింది. మురళీ నాయక్ వీర మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ వాకర్స్ రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కొవ్వొత్తుల ర్యాలీలో వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, క్లబ్ కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, కోశాధికారి పడాలనాయుడు, వాకర్స్ ప్రతినిధులు గుర్రం రామకృష్ణ, పుత్సా కృష్ణ కామేశ్వర్, కుడుపూడి త్రినాథ్, మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వై.అనంత లక్ష్మి పాల్గొన్నారు.

సరస్వతీ నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

అమలాపురం రూరల్: ఈ నెల 15 నుంచి 25వరకు జరిగే కాళేశ్వరం సరస్వతీ నదీ పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 18వ తేదీన ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు మేనేజర్ చల్లా సత్యనారాయణ తెలిపారు. ఈ యాత్ర ప్యాకేజీలో వరంగల్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం రామప్ప దేవాలయాలతో పాటు ముఖ్యంగా సరస్వతి నదిలో పుష్కర స్నానం ఏర్పాటు చేశామని అన్నారు. ఇంద్ర ఏసీ సర్వీసు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ బస్సులకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు సూపర్ లగ్జరీ సర్వీసు నంబర్ 29999, రిజర్వేషన్ కోసం సెల్ నంబర్లు 99592 25576, 9959225550, అసిస్టెంట్ మేనేజర్ సెల్ నంబర్ 7013868687లో సంప్రదించాలన్నారు. సూపర్ లగ్జరీ బస్సు టికెట్ చార్జి రూ.2,200, ఇంద్ర ఏసీ రూ.2,700 ఉంటుందన్నారు. బస్సు సరిపడా ప్రయాణికులు వస్తే వారి గ్రామం నుంచి నేరుగా బస్సును పంపిస్తామని చెప్పారు.

ఈదరపల్లి వంతెన నిర్మాణంతో ట్రాఫిక్ ఆంక్షలు

రెండ్రోజుల్లో అమల్లోకి..



ఈదరపల్లిలో రెండో వంతెన నిర్మాణం కోసం పాత వంతెన వద్ద జేసీబీతో తవ్వుతున్న దృశ్యం

అమలాపురం టౌన్: ఈదరపల్లి వద్ద రెండో వంతెన నిర్మాణం కారణంగా పట్టణ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. పాత వంతెన చెంతనే రెండో వంతెన కొత్తగా నిర్మిస్తున్న క్రమంలో దాదాపు 50 అడుగుల లోతుగా తవ్వారు. దీంతో ట్రాఫిక్ ఆంక్షలు అనివార్యమవుతున్నాయి. రెండు రోజుల్లో కలెక్టర్ ఆమోదం రాగానే ఈదరపల్లి పాత వంతెనపై ట్రాఫిక్ ఆంక్షలు ఆరంభం కానున్నాయి. వంతెన నిర్మాణానికి దాదాపు 9 నెలల సమయం పట్టే అవకాశం ఉంది.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

రావులపాలెం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను బోడసుకుర్రు వంతెన సమీపంలో గల తోట్లపాలెం, వాకలగరువు మీదుగా మళ్లిస్తారు. అమలాపురానికి ఆర్టీసీ బస్సులన్నీ ఇదే మార్గంలో రాకపోకలు సాగించేలా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈదరపల్లి పాత వంతెన మీద నుంచి అంబాజీపేట వైపు వెళ్లే వాహనాలు అమలాపురం నల్ల వంతెన మీదుగా జనుపల్లె, నేదునూరు, ముక్కామల వరకూ వెళ్లి ప్రధాన రోడ్డులో రావులపాలెం వైపు వెళ్లనున్నాయి. ఈదరపల్లి పాత వంతెన మీద నుంచి అంబాజీపేటకు వెళ్లే లేదా అమలాపురంలోకి వచ్చే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు పాత వంతెనకు సమీపంలో అయ్యప్పస్వామి ఆలయం వద్ద పంట కాల్వపై తాత్కాలికంగా నిర్మించిన వంతెన నుంచి రాకపోకలు సాగించాలి. అమలాపురం ఆర్టీసీ బస్ స్టేషన్ నుంచి కాకినాడ వైపు లేదా అల్లవరం, ఉప్పలగుప్తం వైపు వెళ్లే బస్సులు యథావిధిగా పట్టణంలో నుంచి రాకపోకలు సాగిస్తాయి.

హక్కుల చట్టం.. రక్షణ కవచం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌ఓ ఉదయ భాస్కర్

ముమ్మిడివరం: వినియోగదారుల హక్కుల చట్టం రక్షణ కవచమని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ అన్నారు. మంగళవారం జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం అమలుపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. వస్తువులు, సేవల నాణ్యత, పరిమాణం, స్వచ్ఛత, ప్రమాణం, ధర గురించి సరైన సమాచారం తెలుసుకునే హక్కు వినియోగదారునికి ఉందన్నారు. పోటీ ధరల మేరకు వివిధ రకాల వస్తువులు, సేవలను ఎంచుకొనే హక్కు వినియోగదారునికి ఉందన్నారు. పౌరసరఫరాల శాఖకు తోడు కోకో ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లాలోని వినియోగ దారుల సంఘాలు కూడా కృషి చేస్తున్నాయని తెలిపారు. జిల్లా వినియోగదారుల హక్కుల రక్షణ కౌన్సిల్ నియామకం పూర్తయిందన్నారు. కోనసీమ జిల్లా ఏర్పడ్డాక కౌన్సిల్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారన్నారు. కోకో ఫెడ్ జిల్లా అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి మట్లాడుతూ వినియోగదారుల రక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి అదిత్య కిరణ్, కోకో ఫెడ్ సభ్యుడు న్యాయవాది అద్దంకి అమరేశ్వరరావు పాల్గొన్నారు.

సామాజిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలి



శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ వెంకటాచార్య తదితరులు

ముమ్మిడివరం: సామాజిక పరిస్థితులపై యువత అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ తాడి వెంకటాచార్య పేర్కొన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ బెంగళూరు సహాయ సహకారాలతో కార్లిమేట్ సిస్టర్ ఆఫ్ థెరిసా అమలాపురం, పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్, సత్యం చారిటబుల్ ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు యువత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో మంగళవారం శిక్షణను ఎంపీడీఓ వెంకటాచార్య, ఐసీడీఎస్ సీడీపీఓ ఐ.విమల, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఐఎస్‌ఐ కోఆర్డినేటర్ జి.కరుణాకరరావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ యువత సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన పెంపొందించుకుని గ్రామీణ ప్రజలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కన్నీడి వెంకటేశ్వరరావు, సత్యం చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ఎన్.సంజయ్, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపుష్పయాగోత్సవాలు



కోరంగి శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ కురంగేశ్వర స్వామికి శ్రీ పుష్పయాగోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు ఆలయాల్లో శ్రీ పుష్పయాగోత్సవాలు మంగళవారం రాత్రి వైభవంగా జరిగాయి. కోరంగి పంచాయతీ పాత కోరంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత శ్రీ కురంగేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాలలో భాగంగా చివరిరోజున స్వామివారి శ్రీపుష్పయాగోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీవీ వేణుగోపాల్ పర్యవేక్షణలో అర్చకులు కేఆర్‌కే సాయిప్రసాద్ నేతృత్వంలో స్వామికి వివిధ రకాల పుష్పాలు, పండ్లతో పూజలు చేశారు. తాళ్లరేవు శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ కేశవస్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా ఆరవరోజున అర్చకులు పెద్దింటి శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో స్వామివారికి శ్రీ పుష్పయాగం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసియున్న శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీపుష్పయాగం ఘనంగా నిర్వహించారు.

పరిహారంపై ఎంపీని ప్రశ్నించిన రైతులు

ముమ్మిడివరం: బహిరంగ మార్కెట్‌లో రూ.లక్షల్లో పలికే భూములకు రూ.వేలల్లో పరిహారం ఇస్తామంటే ఎలా అని రైతులు ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను ప్రశ్నించారు. రైల్వేలైన్ నిర్మాణంలో భూములు కోల్పోయే అమలాపురం రూరల్, అయినవిల్లి మండలాల రైతులు, గృహ యజమానులతో ముమ్మిడివరం మండలం మహిపాల చెరువు వద్ద ఒక ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. పలువురు రైతులు మాట్లాడుతూ ఎకరా పొలంలో 90 సెంట్లు అవసరమని తీసుకుంటే మిగిలిన 10 సెంట్లలో ఏం పండించుకోగలమని ఆవేదన వ్యక్తం చేశారు. నివాస గృహాలు కోల్పోతున్న వారికి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి పరిహారం అందించాలని కోరారు. భూములు కోల్పోయే రైతులను, గృహ యజమానులను ఆదుకుంటామని ఎంపీ గంటి హరీష్‌మాధుర్ హామీ ఇచ్చారు.

ప్రకటన విడుదల చేసిన రోజే ఇంటర్వ్యూలా!

యానాం: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిపై రీజినల్ హెల్త్ సొసైటీ ద్వారా వివిధ పోస్టులకు నియామకాలను చేస్తున్నామంటూ మంగళవారం ప్రకటించారని అదే రోజున ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సైతం ప్రకటించడం దారుణమని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్థాని దినేష్ విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అభ్యర్థులకు కనీసం వారం రోజుల సమయం ఇవ్వకుండా ప్రకటన ఇచ్చిన రోజే ఇంటర్వ్యూలకు ఆహ్వానించడం ఎక్కడా ఉండదన్నారు. వారికి కావాల్సిన అభ్యర్థులకు టిక్ పెట్టుకోవడానికి ఈ విధంగా నిరుద్యోగ యువకులను మోసం చేయడం తగదన్నారు. .

ఉపాధ్యాయుల బదిలీలు, ఖాళీలపై వర్క్‌షాపు

అమలాపురం రూరల్: త్వరలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీలు, పాఠశాలల్లో ఏర్పడే ఖాళీ పోస్టులపై వెరిఫికేషన్‌పై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. అమలాపురం మండలంలోని ఒక స్కూల్‌లో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపులో పాఠశాలల్లో క్యాడర్ స్ట్రెంగ్త్, క్లియర్ వేకెన్సీలు, రీఆపోర్షన్ వేకెన్సీలు, 5/8 సంవత్సరాల ఖాళీలు, స్టడీ లీవ్స్, మిగులు ఉపాధ్యాయుల వివరాలను ఎంఈవోలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి సేకరించారు.

పంచాయతీ కార్యదర్శులకు ప్రాధాన్యమివ్వాలి

అమలాపురం రూరల్: ప్రభుత్వం తీసుకు వస్తున్న నూతన పంచాయతీ వ్యవస్థలో పంచాయతీ కార్యదర్శులకు ప్రాధాన్యం కల్పించాలని అంబేడ్కర్ కోనసీమ పంచాయతీ కార్యదర్శుల సంఘం కోరింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రుద్రరాజు సూరపరాజు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా గ్రామ పంచాయతీ అధికారి శాంతలక్ష్మిని కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యదర్శులు అబ్బాస్, దుర్గ శ్రీను పాల్గొన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లపుఊట ధ్వంసం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద గోదావరి లంకలో సారా తయారీకి ఉపయోగించే 1000 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్టు కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. అమలాపురం ఏఈఎస్ జి.అమర్‌బాబు, స్వాడ్ సీఐ ఎల్ చిరంజీవి, స్థానిక సీఐ కాత్యాయని పర్యవేక్షణలో ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది నిర్వహించిన దాడుల్లో భాగంగా బొబ్బర్లంక సమీపంలోని లంక సారా తయారీకి సిద్ధంగా ఉంచిన పులిసిన బెల్లపుఊటను గుర్తించారు. ఇసుక దిబ్బల్లో పాతిపెట్టిన ఊట డ్రమ్ములను వెలికితీసి ఊటను ధ్వంసం చేశారు. అదే మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన 8 మంది వ్యక్తులు సారా కేసుల్లో నమోదవగా వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

మహిళపై అత్యాచారయత్నం!

అల్లవరం: అల్లవరం సడక్ రోడ్డులో ఓ మహిళ తలపై గాయంతో ఉండటంతో చూసిన స్థానికులు 112 నంబర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అల్లవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. ఆమె మొల్లేటిమెరక ప్రాంతానికి చెందిన మాకే మంగాదేవిగా పోలీసులు గుర్తించారు. స్పృహ లేకుండా పడి ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గోసంగివారిపేటకు చెందిన ఓ వ్యక్తి సోమవారం రాత్రి తీసుకెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. ఆ వ్యక్తి ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గోవులకు ఎండుగడ్డి సమర్పణ



గోవులకు ఎండుగడ్డి అందించిన సర్పంచ్ దంపతులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయంలోని గోశాలలో ఉన్న గోవులకు పలువురు దాతలు మంగళవారం ఎండుగడ్డిని సమర్పించారు. గోశాలలోని గోవులకు దాతలు ఎండుగడ్డి అందించాలంటూ దేవస్థానం చేసిన అభ్యర్థనపై పలువురు దాతలు స్పందించారని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. పెదపట్నం సర్పంచ్ గుబ్బల దుర్గ, పండు దంపతులు ఒక ట్రాక్టరు ఎండు గడ్డిని అందించారని తెలిపారు. పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లికి చెందిన సూదా వీరభద్రరావు, ఆయన మనవలు ఆయుష్, అయాన్స్ ఒక ట్రాక్టరు ఎండు గడ్డిని సమర్పించారన్నారు. ఏలూరు జిల్లా నిడమర్రు మండలం బావాయిపాలేనికి చెందిన బొబ్బిలి వెంకట సీతారామారావు, బొబ్బిలి ప్రసాద్ ఒక ట్రాక్టర్ గడ్డిని అందించారన్నారు. దాతలను ఆలయ ఈఓ అభినందించారు.